**:: "శ్రీమద్రామాయణం – బా ల కా ం డ – సకలసంపత్ప్రదం" ::**

:: రచన :- శ్రీ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు - ఆంధ్ర వాల్మీకి) గారి సంకీర్తన - 09.10.2022 ::

:: గానం :- డా॥ ఆముక్తమాల్యద సుషమ ::

**01.** పల్లవి :

ఎక్కడ జూచిన మన శ్రీరాముడె ఎదురుగ నున్నాడు ।
మ్రొక్కెడి వారల మ్రొక్కులు గైకొని మురియుచునున్నాడు ॥ ॥ ఎక్కడ ॥

**02.** చరణం :

దిక్కు నీవే యనెడివారల దిక్కై యున్నాడు ।
తక్కక తను సేవించెడి వారల దాపై యున్నాడు ।
చూడగ కోరిక గలిగిన భక్తుల చూపై యున్నాడు ।
లేడని వదరెడి శుంఠల పాలిట లేకయె యున్నాడు ॥ ॥ ఎక్కడ ॥

**03.** చరణం :

మనసున దలచెడివారల యందలి మనసై యున్నాడు ।
వినగోరిన యా ధన్య చరిత్రుల వీనుల యున్నాడు ।
తన్నునుతించెడి వారల వాక్కుల తానై యున్నాడు ।
తన్నర్చించెడి పుణ్యుల కరములు తానై యున్నాడు ॥ ॥ ఎక్కడ ॥

**04.** చరణం :

పూజలు పూజా ద్రవ్యంబులు మరి పూజించెడి వారు ।
పూజిత పూజా ఫలములు తానై రాజిలు చున్నాడు ।
దాసోహంబను వారిని వదలక తగిలి యున్నాడు ।
వాసుదాసుని తీయ పలుకులకు వశుడైయున్నాడు ॥ ॥ ఎక్కడ ॥

\- - -